జల దోపిడీపై స్పందించని
తెలుగు రాష్ట్రాలు

- ప్రైవేట్ కంపెనీ నీటి చౌర్యంపై మౌనం
- సామాజికవేత్త అశోక్ కుమార్

అశోక్‌కుమార్

ఖైరతాబాద్, జనవరి 19: శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ దోపిడీకి గురవుతున్నా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సామాజికవేత్త అశోక్ కుమార్ విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం కుడి కాలువ నుంచి గ్రావిటీ ద్వారా పొతిరెడ్డిపాడు, బనకచర్ల మీదుగా నీరు ప్రవహిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో కర్నూలు జిల్లాలోని పిన్నాపురం రిజర్వాయర్ వద్ద ఓ ప్రైవేట్ సోలార్ విద్యుత్ సంస్థ నీటి చౌర్యానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. అక్రమంగా జల విద్యుత్తు ప్రాజెక్టును కట్టి నీటిని ఉపయోగించుకుంటూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్టు వివరించారు. జల దోపిడీ వల్ల హైదరాబాద్ నగరానికి తాగునీటితో పాటు పాలమూరు, కొడంగల్ లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీటి కరువు ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లానని, నీటి చౌర్యాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత పాలకులపైనే ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కే ప్రభాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సైదా రావు తదితరులు పాల్గొన్నారు.

సాగు జలాల కోసం
రైతుల మౌన ప్రదర్శన

రాజాపేటలో కొనసాగుతున్న నిరసనలు

రాజాపేట, జనవరి 19 : కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా మండలంలోని చెరువులను నింపాలని డిమాండ్‌చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో రైతులు మూడ్రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మూతికి నల్ల గుడ్డలు కట్టుకొని మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ మాట్లాడుతూ.. మండలంలోని గొలుసుకట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

పసుపునకు మద్దతు ధర ఏమైంది?

- క్వింటాకు 15 వేలు ఇవ్వాలి
- అప్పుడే పసుపుబోర్డుకు సార్థకత
- మేం పసుపు బోర్డు డిమాండ్ చేసినప్పుడు ధర్మపురి అర్వింద్ రాజకీయాల్లోనే లేరు
- నేను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తెచ్చా
- నిజామాబాద్‌లో మీడియాతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పసుపు బోర్డు ప్రారంభోత్సవం నిర్వహించిన తీరుపై మండిపాటు

నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, దాదన్నగారి విఠల్‌రావు, నీతూకిరణ్

నిజామాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పసుపుబోర్డు ఏర్పాటును బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. క్వింటా పసుపునకు రూ.15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని, పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రెండూ చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టంచేశారు. తూతూ మంత్రంగా పసుపుబోర్డును ఏర్పాటుచేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సామర్థ్యాన్ని కేంద్రం సమకూర్చాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పసుపుబోర్డు ఏర్పాటును ప్రకటించిన విధానంపై అభ్యంతరాలున్నాయని, పసుపుబోర్డు ప్రారంభోత్సవాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, ప్రొటోకాల్ పాటించలేదని, ఇది ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధమని స్పష్టంచేశారు.

2014 నుంచి పోరాటం

పసుపుబోర్డును ఏర్పాటుచేయాలంటూ 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గుర్తుచేశారు. పలువురు ముఖ్య మంత్రులను కలిసి పసుపుబోర్డు ఏర్పాటుకు మద్దతు లేఖలు సేకరించానని, ప్రధాని మోదీని రెండుసార్లు కలిసి విజ్ఞప్తి చేశానని వివరించారు. పార్లమెంట్‌లో అనేకసార్లు మాట్లాడటమే కాకుండా ప్రైవేట్ మెంబర్ బిల్లును కూడా ప్రవేశపెట్టానని తెలిపారు. బోర్డు ఏర్పాటు మాత్రమే కాకుండా కనీస మద్దతు ధర ప్రకటించాలని, దిగుమతులపై నియంత్రణ విధించాలని కేంద్రానికి అనేకసార్లు విన్నవించానని చెప్పారు. ఇలా గతంలో త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని స్పష్టంచేశారు. పసుపుబోర్డు ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే పసుపు ఆధారిత పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడానికి కృషిచేసినట్టు తెలిపారు. ఇతర దేశాల నుంచి నాణ్యత లేని పసుపు దిగుమతి అవుతున్నదని, దాంతో రైతులు నష్టపోతున్నారని, దిగుమతులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. 2014లో ఎనిమిది లక్షల క్వింటాళ్ల పసుపు దిగుమతి అయితే, ఇప్పుడు రెట్టింపయిందని, ఏటేటా దిగుమతులు పెరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఎంపీ అర్వింద్ తీరుపై మండిపాటు

బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ గాలిమాటలు మాట్లాడటం మానేసి పసుపునకు మద్దతు ధర సాధించాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. స్పైసెస్‌బోర్డు బెంజ్ కారులాంటిదని, పసుపుబోర్డు అంబాసిడర్ కారులాంటిదంటూ గతంలో అవహేళన చేసిన అరవిందŠకు ఇప్పుడు మాట్లాడే నైతికహక్కు లేదని మండిపడ్డారు. ఎంపీ అరవిందŠకు వెకిలిమాటలు మాట్లాడటం అలవాటని, తాము పసుపుబోర్డు డిమాండ్ చేసే నాటికి అరవిందŠ అసలు రాజకీయాల్లో లేరని స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన తండ్రిచాటు బిడ్డగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిపిస్తే ఐదురోజుల్లో పసుపుబోర్డు తీసుకొస్తానంటూ బాండ్‌పేపర్ రాసిన అరవిందŠ.. ఎంపీగా గెలిచిన తర్వాత పసుపుబోర్డు కంటే స్పైసెస్‌బోర్డే బాగుంటుందని అన్నారని గుర్తుచేశారు. ఒక వేళ బెంజ్‌కారు ఉంటే అంబాసిడర్‌కారు ఎందుకు ఇచ్చినట్టు? అని ప్రశ్నించారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడం వల్లే గతంలో స్పైసెస్‌బోర్డు కార్యాలయం ఏర్పాటైందని, అది కూడా ఆయన గొప్పతనమని చెప్పుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. స్పైసెస్‌పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద గతంలో కేసీఆర్ 42 ఎకరాలు కేటాయించారని, ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌మీట్ అనంతరం ఎమ్మెల్సీ కవితను పసుపు కొమ్ములతో తయారుచేసిన దండతో పలువురు బీఆర్ఎస్ నేతలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నిజామాబాద్ మేయర్ నీతూకిరణ్, బీఆర్ఎస్ నేతలు సుజిత్‌సింగ్ ఠాకూర్, బాజిరెడ్డి జగన్, సిర్ప రాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను గాలి కొదిలేసిన కా సర్కారు

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): విజ్ఞానాన్ని పెంచి ఉజ్వల భవిష్యత్తును అందించే గ్రంథాలయాలను కాంగ్రెస్ సర్కార్ విస్మరించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో గ్రంథాలయాల్లో వసతులు కల్పించి విద్యార్థులు, ఉద్యోగార్థులకు బాసటగా నిలిస్తే, రేవంత్ సర్కార్ పట్టించుకోవడం లేదని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాన చేశారని, ఏడాది దాటినా నిర్మాణ పనులు మొదలుపెట్టలేదని ఆరోపించారు. తాత్కాలికంగా ఏర్పాటుచేసిన గ్రంథాలయంలో స్థలం సరిపోక ఉద్యోగార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే నూతన భవన పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని గ్రంథాలయాలకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు-2లోని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నంది పంప్‌హౌస్‌లో ఆరో నంబర్ మోటర్ నుంచి ఎగిసి పడుతున్న గోదావరి జలాలు

'కాళేశ్వరమే' దిక్కయింది

- నంది, నారాయణపూర్ రిజర్వాయర్లకు నంది పంప్‌హౌస్ నుంచే నీళ్లు

ధర్మారం, జనవరి 19 : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది, కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్లకు ఎల్లంపల్లి నీటిని తరలించేందుకు మళ్లీ కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది పంప్‌హౌస్ మోటర్లే దిక్కయ్యాయి. కాంగ్రెస్ హయాంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన వేములనూర్ వద్ద ఎల్లంపల్లి పంప్‌హౌస్‌లో రెండు మోటర్లు మొరాయించడంతో మళ్లీ నంది పంప్‌హౌస్ మోటర్లనే వినియోగిస్తున్నారు.

ఎల్లంపల్లిలో మొరాయించిన మోటర్లు

నంది రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటి మట్టం 233 మీటర్లు కాగా, ప్రస్తుతం 225 మీటర్లకు పడిపోయింది. దీంతో దీని కింద ఉన్న 650 ఎకరాల్లో యాసంగి సాగుకు సరిపడా నీరందని పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది పంప్‌హౌస్‌ను వినియోగించుకుండా, ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి మండలం వేంనూరు వద్ద నిర్మించిన ఎల్లంపల్లి పంప్‌హౌస్‌లో మోటర్లను ఆన్‌చేసి పంపింగ్ చేయాలని సంకల్పించారు. ఈ నెల 16న ఇందులోని 1వ మోటర్‌ను ఆన్‌చేసే ప్రయత్నం చేయగా మొరాయించగా. 2వ మోటర్‌ను ఆన్‌చేశారు. దాని ద్వారా కేవలం 247 క్యూసెక్కులు మాత్రమే నంది రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేశారు. ఓ వైపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం, మరో వైపు ఆ మోటర్ కూడా మొరాయించడంతో అదే రాత్రి నిలిపేశారు. రెండు మోటర్లు కూడా నడవకుండా మొరాయించడంతో ఎల్లంపల్లి పైపులైన్ ద్వారా నీటి పంపింగ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది.

పెద్ద దిక్కయిన నంది పంప్‌హౌస్

నంది, అక్కడి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్లలో నీటిని నింపడానికి బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన నంది పంప్‌హౌస్ మోటర్లనే ఇప్పుడు దిక్కయింది. ఇక అధికారులు దాని ద్వారానే నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. శనివారం రాత్రి 9 గంటల నుంచి నంది పంప్‌హౌస్‌లోని 6వ మోటర్‌ను ఆన్ చేయడంతో గోదావరి జలాలు ఎగిసి పడుతూ నంది రిజర్వాయర్‌లోకి చేరుకుంటున్నాయి. ఎల్లంపల్లి పైప్‌లైన్ మార్గం ద్వారా ఒక మోటర్‌తో కేవలం 247 క్యూసెక్కులు రావడం వల్ల రెండు రిజర్వాయర్లు నిండటానికి రోజుల తరబడి సమయం పట్టేది. నంది పంప్‌హౌస్‌లోని మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కులు వస్తుండటంతో తొందరగానే నిండే అవకాశం ఉన్నది. రైతుల పొలాలు ఎండక ముందే నీళ్లందుతాయి. నంది రిజర్వాయర్‌లోకి నీరు రావడంతో ఆదివారం మధ్యాహ్నం ఇక్కడి ఎల్లంపల్లి పంప్‌హౌస్‌లోని రెండో నంబర్ మోటర్ ఆన్ చేసి నారాయణపూర్ రిజర్వాయర్‌కు 247 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

పుట్టెగూడెంలో నీటి కోసం వేస్తున్న బోరు నుంచి వస్తున్న దుమ్ము

750 ఫీట్లు వేసినా దుమ్మే..

- నీరు రాక నిరాశలో రైతన్న
- యాదాద్రి జిల్లా రాజాపేట మండలంలో అడుగంటిన భూగర్భ జలాలు

రాజాపేట, జనవరి 19 : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువులు, కుంటలు వట్టిపోవడంతో భూగర్భ జలాలు మరింతగా పడిపోయాయి. మండలంలోని కొన్‌రెడ్డిచెర్వు గ్రామానికి చెందిన రైతు చెరుకు కనకయ్యకు పాముకుంట శివారులో రెండు ఎకరాల పొలం ఉన్నది. ఈ సారి నీళ్లు లేక చెరువులు వట్టిపోవడంతో పొలంలో ఉన్న బోరు ఎండిపోయింది. దాంతో వరి సాగు చేయాలని ఆదివారం పాముకుంట గ్రామ శివారు పుట్టెగూడెం సమీపంలో మరో బోరు వేయించాడు. 750 ఫీట్లు వేసినా చుక్క నీరు రాలేదు. దుమ్మే రావడంతో రైతన్నకు నిరాశే మిగిలింది.

ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన ఎల్లంపల్లి హౌస్ వద్ద మోటర్లు మొరాయించడంతో పెద్దపల్లి జిల్లా నందిమేడారంలోని నంది రిజర్వాయర్ వద్ద ఖాళీగా ఉన్న పంపులు

రివర్స్ గోదారి

మొదటిపేజీ తరువాయి...

దాఖలాలు ఉన్నాయి. గత యాసంగిలోనే ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో సాగునీటి కోసం రైతులు అల్లాడిపోవడంతో అంతకు ముందు ఏడాదితో పోలిస్తే, సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడి సైతం పడిపోయినట్టు గణాంకాలు చెప్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గణనీయంగా పెంచిన గోదావరి జలాల నీటి సామర్థ్యంతో రైతులను ఆదుకునే పరిస్థితి ఉన్నప్పటికీ రానున్న వర్షాకాలంలో బాబ్లీ మీదుగా కిందకు గోదారమ్మ ఉరకలు వేస్తే తప్ప లక్షలాది ఎకరాల్లో నాగలి ముందుకు కదిలేలా లేదు.

పడిపోయిన ఎస్సారెస్పీ నిల్వ సామర్థ్యం

ఇప్పటికీ కాంగ్రెస్ నేతలు ఘనంగా చెప్పుకుంటున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు 1963లో శంకుస్థాపన చేస్తే, 1984లో ఫ్రస్టుగేట్లను ఏర్పాటు చేశారు. అంటే రెండు దశాబ్దాల తర్వాతగానీ నీటిని నిల్వ చేయలేదు. ఆ తర్వాత 1994లో ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబరేటరీస్ (ఏపీఈఆర్ఎల్) హైడ్రోగ్రాఫిక్ సర్వే చేయగా.. ఎస్సారెస్పీ నిల్వ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 90.30 టీఎంసీలకు అంటే పదేండ్లలోనే 21.70 టీఎంసీల మేర పడిపోయినట్టుగా తేలింది. 2013 డిసెంబర్-2014 జనవరిల్లో అధునాతనమైన ఇంటిగ్రేటెడ్ బోట్ మౌంటెడ్ బాతిమెట్రిక్ సర్వే (ఐబీఎస్) విధానంతో మరోసారి హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహించగా.. నీటి నిల్వ సామర్థ్యం ఏకంగా 80.104 టీఎంసీలకు పడిపోయినట్టుగా గుర్తించారు. ప్రాజెక్టు వాస్తవ నీటి నిల్వ సామర్థ్యం కంటే 31.912 టీఎంసీలు (28.48%) తగ్గిందన్న మాట. పైపెచ్చు కాంగ్రెస్ ప్రభుత్వం మహారాష్ట్రతో చేసుకున్న లోపభూయిష్టమైన ఒప్పందాన్ని ఆసరాగా చేసుకొని, ఎస్సారెస్పీ ఎఫ్ఆర్ఎల్ పరిధిలోనే మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టును నిర్మించింది. ఇప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు శ్రీరాంసాగర్ నిల్వ సామర్థ్యాన్ని 90 టీఎంసీలుగా రికార్డుల్లో చూపుతున్నా వాస్తవ సామర్థ్యం 80.104 టీఎంసీలేనని సర్వేలు చెప్తున్నాయి. ఈ క్రమంలో మొదటి దశలో 9,68,640 ఎకరాల ఆయకట్టు, రెండో దశలో 3,98,192 ఎకరాలు ఇలా రెండు దశల్లో కలిపి 13,66,832 ఎకరాల ఆయకట్టు ప్రణాళికలతో దశాబ్దాలపాటు కొనసాగిన పనులు తెలంగాణ ఏర్పడేనాటికి కూడా పూర్తి కాలేదు. కీలకమైన కాకతీయ కాల్వ ప్రవాహ సామర్థ్యం 8 వేల క్యూసెక్కులైతే, రాష్ట్రం ఏర్పడేనాటికి అందులో 3 వేల క్యూసెక్కులు కూడా పారే పరిస్థితులు లేకుండాపోయాయి. దీనికితోడు ఎస్సారెస్పీ ఆధారంగా అలీసాగర్, గుత్ప ఎత్తిపోతలతోపాటు అనేక లిఫ్టు ప్రాజెక్టులు, కాల్వల మీద మోటర్లతో పారించుకునే భూములు... ఇలా అన్నీ లెక్కేస్తే 22 లక్షల ఎకరాల ఆయకట్టు దీనిపై ఆధారపడి ఉన్నది.

మారిన ముఖచిత్రం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒకవైపు కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడంతోపాటు ఎస్సారెస్పీ ప్రాజెక్టులోని పెండింగ్ పనులన్నీ పూర్తిచేశారు. కాకతీయ కాల్వ సామర్థ్యం 8 వేల క్యూసెక్కులకు పునరుద్ధరించారు. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎస్సారెస్పీ జలాలను కేవలం సరస్వతి, లక్ష్మీ కెనాల్, ఎల్ఎండీ ఎగువన ఉన్న ఆయకట్టుకు మాత్రమే పరిమితం చేశారు. ఎల్ఎండీ దిగువనున్న ఆయకట్టు మొత్తానికి దాదాపుగా కాళేశ్వరం నుంచి ఎత్తిపోసిన జలాలనే తరలిస్తూ వచ్చారు. ఒకవైపు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, మిషన్ భగీరథ పథకాలకు మండు వేసవిలోనూ నీటి లభ్యత ఉంచడంతోపాటు ఎండాకాలంలో కూడా ప్రతి గ్రామంలోని చెరువులు జలకళతో కళకళలాడేలా ఎప్పటికప్పుడు కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోశారు. అందుకే తెలంగాణ ఏర్పడేనాటికి 2014-15లో తెలంగాణ రైతులు పండించిన ధాన్యం రూ.12,871.01 కోట్ల విలువైన 68.17 లక్షల టన్నులు ఉండగా, 2019-20లో ఏకంగా 180.53 లక్షల టన్నులకు, వాటి విలువ రూ.34,084 కోట్లకు చేరింది. అంటే వృద్ధి 80.53 లక్షల టన్నులు. తదుపరి 2020-21 కరోనా సమయంలో కూడా 265.34 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. 2022-23లో 278.30 లక్షల టన్నులతో రూ.54,546.80 కోట్ల ధాన్యం ఉత్పత్తి కాగా... 2023-24లో 256 లక్షల టన్నులు నమోదైంది. ఇందులో ఎస్సారెస్పీ పరిధిలోనే రికార్డుస్థాయి ధాన్యం ఉత్పత్తి జరిగింది. గత యాసంగిలో కాళేశ్వరం జలాలు అందుబాటులో లేకపోవడంతో ఉన్న నీటి నిల్వలతోనే ప్రభుత్వం సరిపెట్టాల్సి వచ్చింది. ఫలితంగా అనేకచోట్ల రైతులు సాగు నీటి కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసి ఆందోళనబాట పట్టారు. అనేకచోట్ల పంటలు ఎండిపోవడంతోపాటు సాగునీరు సరిగా అందక దిగుబడి తగ్గింది. అందుకే 2022-23తో పోలిస్తే 2023-24లో ధాన్యం దిగుబడి అంకెలు తక్కువగా నమోదయ్యాయి.

ఈ యాసంగిలోనూ ప్రమాద ఘంటికలు

ప్రస్తుతం గోదావరి బేసిన్‌లోని ఎస్సారెస్పీ మొదలు ఎల్లంపల్లి, మిడ్ మానేరు, ఎల్ఎండీతోపాటు అన్న పూర్ణ, రంగనాయకసాగర్, అనంతసాగర్ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు... క్షేత్రస్థాయిలో పండిస్తున్న పంటలకు కావాల్సిన సాగునీటి పరిమాణానికి పొంతన లేదు. ఎక్కడా చెరువుల్లో జలకళ లేదు. వీటికితోడు రానున్న వేసవిలో హైదరాబాద్‌తోపాటు గ్రామాల తాగునీటి అవసరాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. కాళేశ్వరం బరాజ్‌లను ఎండబెట్టడంతో రానున్న వర్షాకాలం వరకు అదనంగా చుక్క నీరు కూడా అందదు. దీంతో గత యాసంగిలోని కష్టాలు మళ్లీ మొదలుకానున్నాయని ఇంజినీర్లు చెప్తున్నారు. వీటన్నింటికీ మించి వచ్చే వర్షాకాలంలో వర్షాలు ఆలస్యమైతే జలాశయాల్లో నీటి నిల్వ ఉండే పరిస్థితులు లేనందున కాలం కూడా ఆలస్యమయ్యే ప్రమాదం పొంచి ఉన్నది.

నాట్ల దశలోనే నీటి గోస

మొదటిపేజీ తరువాయి...

చేను.. చెలక ఎడారి' అని పదేండ్ల కింద పాడుకున్న పాటను ఏడాదిలోనే కాంగ్రెస్ సర్కారు రైతులతో మళ్లీ పాడిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రానికే జీవధారగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టును కుట్రలతో పక్కన బెట్టి పొలాలను ఎండబెడుతున్నది. రేవంత్ సర్కార్ నిర్వాకంతో రైతుభరోసా అందక.. రుణమాఫీ పూర్తికాక అప్పులు చేసి పంటలు వేసిన అన్నదాతలు అరిగోస పడుతున్నారు. కాలువల్లో నీళ్లు రాక.. చెరువులు, కుంటలు ఎండిపోయి బావుల్లో ఉన్న కొద్దిపాటి నీళ్లతో వేసిన పంటలు చేతికొస్తాయా అని దిగులుచెందుతున్నారు. 1000 ఫీట్ల వరకు బోర్లు వేసినా దుమ్మే తప్ప చుక్క నీరు రాకపోవడంతో బిక్క ముఖం వేస్తున్నారు. నాట్ల దశలోనే చాలా చోట్ల పొలాలు ఎండిపోతున్నా.. మొద్దునిద్ర వీడని సర్కారుపై కన్నెర్రజేస్తున్నారు.

నారాయణపూర్ రిజర్వాయర్ పరిధిలోని గంగాధర మండలం చెర్లపల్లిలో ఎండిన పొలం

నీటి హబ్‌లో నీళ్ల కరువు

ఒకప్పుడు నీటి హబ్‌గా ఉన్న కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులకు మళ్లీ సాగు నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, కాళేశ్వరం ప్రాజెక్టులతో భూగర్భ జలాలు సైతం పెరిగి ఏటా రెండు పంటలు పండించిన రైతులకు ఇప్పుడు సాగు నీటి కటకట తలెత్తింది. ముఖ్యంగా మిడ్‌మానేరు పరిధిలోని తోటపల్లి రిజర్వాయర్ కుడి కాలువకు పూర్తి స్థాయిలో నీళ్లందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిగురుమామిడి, సైదాపూర్, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని చివరి ఆయకట్టుకు నీటి గోస ఎదురవుతున్నది. ఈ కాలువ పరిధిలో 49 వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా, 18 నుంచి 20 వేల ఎకరాలకే అందుతున్నది. చిగురుమామిడి మండలం ఇందుర్తిలో ప్రారంభమయ్యే కుడి కాలువ సైదాపూర్ మండలం బొమ్మకల్ దాకా వెళ్తుంది. ప్రస్తుతం ఇదే మండలం దుద్దెనపల్లి వరకే నీళ్లిస్తున్నారు. 4-ఎల్ ద్వారా మానకొండూర్ మండలం చెంజర్ల, నిజాయితీగూడెం, పెద్దూరుపల్లి వరకు నీరందాల్సి ఉన్నది. తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం, పర్లపల్లి, నల్ల గొండ, మక్తపల్లి, మన్నెంపల్లి, పోలంపల్లి, పోరండ్లకు ఇంకా నీళ్లు చేరలేదు.

ఎస్సారెస్పీ ఫేజ్-2 ఆయకట్టు ప్రశ్నార్థకం!

సూర్యాపేట జిల్లా పరిధిలో ఎస్సారెస్పీ ఫేజ్-2 కింద ఉన్న 2.95 లక్షల ఎకరాల ఆయకట్టుకు చుక్క నీరు వచ్చిన ఆనవాళ్లు లేకపోగా కాళేశ్వరం ప్రాజెక్టే జీవధారగా మారింది. కాంగ్రెస్ చిన్న సాకుతో కాళేశ్వరాన్ని పక్కనపెట్టడంతో యాసంగిలో వేలాది ఎకరాల్లో వరి ఎండిపోయింది. యాసంగిలో 2.40 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. నిరుడు యాసంగి దుస్థితి పునరావృతమవుతుందేమోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

అడియాసలు చేసిన కాంగ్రెస్

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని 11 గొలుసుకట్టు చెరువులు, 32 కుంటలను నింపి 35,131 ఎకరాలకు సాగు నీరందించాలని గత బీఆర్ఎస్ సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేసింది. అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కృషితో రూ.12 కోట్లు విడుదలయ్యాయి. గంధమల్ల ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తికాక ముందే కాళేశ్వరం ప్యాకేజీ 15లో భాగంగా 29 కిలో మీటర్ల పొడవున బ్యాచ్ కెనాల్ తవ్వకం కోసం మండలంలో 157 ఎకరాల భూమిని సేకరించారు. సింగారంలో 40.10 ఎకరాలు సేకరించి రైతులకు పరిహారం అందజేశారు. నిరుడు వర్షాలతో చెరువులు నిండి భూగర్భ జలాలు పెరిగి యాసంగిలో 20 వేలకు పైగా ఎకరాల్లో వరి పండించారు. ఈ యాసంగిలో చెరువులన్నీ అప్పుడే వట్టి పోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి బోరుబావులు, బావులు ఎండిపోతున్నాయి. 1000 ఫీట్ల వరకు బోర్లు వేసినా దుమ్మే తప్ప చుక్క నీరు రావడం లేదు.

ఎండుతున్న పంటలు.. సర్కారు మీనమేషాలు

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ పరిధిలోని గ్రామాల్లో పొలాలు ఎండి పోయాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ రిజర్వాయర్‌కు నేరుగా ఎత్తిపోతల సదుపాయం ఉన్నది. సకాలంలో ఎత్తిపోతలు చేపడితే చొప్పదండి నియోజకవర్గంలోని 70 చెరువులను నింపే అవకాశం ఉండేది. ఎల్లంపల్లి ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు వారం క్రితమే చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ప్రకటించినా ఇంతవరకు ప్రక్రియ ప్రారంభించలేదు. ఎస్సారెస్పీ ఫేజ్-2 కాలువల నుంచి వారం పాటు నీటిని విడుదల చేయగా సూర్యాపేట జిల్లాలో సగం పొలాలకు కూడా చేరుకోలేదు. అర్వపల్లి, తుంగతుర్తి, మద్దిరాల, నాగారం, చివ్వెంల, నడిగూడెం, మునగాల, పెన్‌పహాడ్ మండలాల్లోని కాలువల్లో నీళ్లు పారడంలేదు.

సాగునీటి కోసం ఆందోళనలు

చెరువులు వట్టి పోయి భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కాంగ్రెస్ సర్కార్‌పై రైతన్నలు కన్నెర్రజేస్తున్నారు. రాజాపేట మండలంలోని గొలుసుకట్టు చెరువులను కాళేశ్వరం 15వ ప్యాకేజీ ద్వారా నింపాలని దీక్షలు కొనసాగిస్తున్నారు. ఎమ్మెలే అయిలయ్య ఇచ్చిన మాట ప్రకారం కాళేశ్వరం 15వ ప్యాకేజీ కాలువ పనులు పూర్తి